# గురువే న్నమః

## కొమ్మనాపల్లి గణపతిరావు



ఎల్.కె.జి. ప్లస్ యు.కె.జి. ప్లస్ 10 ప్లస్ 2 ప్లస్ బి.ఎస్సి., ఎం.ఎస్సి. వెరసి 19 ఏండ్ల చదువు. సంవత్సరానికి సగటున ఐదు మంది టీచర్లున్నా దాదాపు వందమంది దాక నన్నో బాధ్యతాయుత పౌరునిగ తీర్చ దానికి కృషి చేశారు. ఇంత మంది గురువులలో నాకు చిరస్మరణీయులెవరు? నా చదువైపోయి చాలా ఏండ్లు అయ్యింది. ఇప్పుడు నా మనస్సులో నిలిచిపోయినవారు బహుశా నా జీవితాంతం అలాగే నా జ్ఞాపకాలలో ఉండిపోతారేమో.

* * *


టీచర్ పేరు సుదర్శన్? సుశన్యా? పేరు గుర్తు లేదు. మూడో తరగతిలో హిందీకి వచ్చేది. వయస్సు ఇరవై ఐదులోపే ఉంటుందనుకుంటాను. చామన ఛాయ రంగు. సన్నగా ఉండేది. ముఖంలో ఎప్పుడూ చిరాకు. ఆవిడ దగ్గరున్న ఆయుధాలు రెండు. తెలంగాణా యాసలో తెలుగు ఉర్దూ కలిపి నోరు పారేసుకోవడం ఒకటి. 'సువ్వర్' లేక సువ్వర్ కే బచ్చే' ఆవిడ కిష్టమైన సంబోధనా విభక్తులు. ఈ సంబోధన పని చేయని పక్షంలో, ఆవిడ పిల్లల్ని దగ్గరకు పిలిచి నోరు తెరవమని ఓ చాక్ పీసును పళ్ళ మధ్య నిలబెట్టేది. ఆ రోజు ఇక ఆ పిల్లాడు, ఆ క్లాసు తరువాత దవడ నొప్పితో ఏడ్వాల్సిందే. అందుకేనేమో నాకు ఆవిడంటే చచ్చేంత భయం. ఆవిడ క్లాసంటే మరీ భయం. హిందీ అంటే చెప్పలేని అయిష్టం.

* * *

ఈ టీచర్ పేరునాకు బాగా జ్ఞాపకం. పద్మిని టీచర్. సైన్సుకు వచ్చేవారు. నేనంటే చాలా ఇష్టం. దానికి కారణం, క్లాసులో అందరికంటే నేను చురుగ్గా ఉండటమే కావచ్చును. ఓ రోజు, ఆరో తరగతి చదివేటప్పుడు, ఆవిడ మాకు ఓరల్ టెస్టు పెట్టారు. ప్రశ్నలన్నీ అంతకుముందు రోజు పూర్తి చేసిన పాఠంలోనివే. అన్నిటికీ నేనొక్కడినే చేతులెత్తాను. క్లాసులో ఎవ్వరూ జవాబివ్వని వాటికన్నిటికీ నేను జవాబివ్వటం మొదలెట్టాను. చివరకు టీచర్ నవ్వుతూ నన్ను దగ్గరికి పిలిచి, "చూడండి, ఎంత బాగా జవాబు లిస్తున్నాడో, అందరూ ఇలాగ చదివితే ఎంత బాగుంటుంది,' అని నన్ను దగ్గరికి తీసుకొని బుగ్గమీద ఓ ముద్దిచ్చారు. ఎంత సిగ్గు పడ్డాను. ఎంత సంతోష పడ్డాను. అప్పటి నుంచి నేను ఎస్.ఎస్.సి. పూర్తి చేసే వరకు, నా క్లాసులో ఎవ్వరికీ నాకంటే సైన్సులో ఎక్కువ మార్కులు తెచ్చుకునే అవకాశం ఇవ్వలేదు.

* * *

స్కూలును తనిఖీ చేయడానికి, అధికార్లు వస్తున్నారంటే, స్కూల్లో కలిగే హడావిడిని గురించి చెప్పే అవసరం లేదనుకుంటాను. మనోరమ టీచర్, మామూలు టీచరే. ఇంగ్లీషుకు వచ్చేది. ఇన్స్పెక్షన్ అని మమ్మల్ని ముందే బాగా హెచ్చరించి, తను చెప్పబోయే పాఠం, అడగబోయే ప్రశ్నలు, దానికివ్వాల్సిన జవాబులు అన్నీ చెప్పింది. ఇన్స్పెక్టర్‌గారు వచ్చి క్లాసు వెనుక కుర్చీలో కూర్చోగానే ఆవిడ తన పాఠం మొదలెట్టింది. అది ఇంగ్లీషులో పద్యం. 'హు హాజ్ సీన్ ది విండ్, నెయ్‌దర్ ఐ, నార్ యూ...' (గాలిని ఎవరు చూశారు? నేనూ నీవూ ఎవ్వరూ చూడలేదు...) ఏదో అవస్థలు పడుతూ, చెమటలు కక్కుతూ పాఠం పూర్తి చేసి మా చేత తనకు కావలసిన జవాబులు వినిపించుకొని అధికారి మెప్పు కోసం ఆయన వైపు చూసింది. ఇన్స్పెక్టర్ అనుభవశాలి అనుకుంటాను. ఆయన తనకు తోచిన ప్రశ్నలను అడగ సాగారు. ఉన్నట్టుండి ఆయన, 'గాలి లాగ మనం చూడని, కానీ ఉందని తెలిసిన వస్తువేదైనా ఉందా?' అని క్లాసు నుద్దేశించి అడిగారు. వెంటనే నేను లేచి, 'ఉందండీ. దేవుడు! మనమెవ్వరం దేవుణ్ని చూడ లేదు. కాని దేవుడున్నాడని మనకు తెలుసు' అని జవాబిచ్చాను. ఇంక అటు తరువాత నన్నాయన అలానే



—'నిర్మలాదిత్య'

మరి కొన్ని ప్రశ్నలేసి, పిరియడ్ ముగియడంతో వెళ్ళిపోయారు.

నేను ఘనకార్యం చేసిన వాడిలా సంతోషంగా మనోరమ టీచర్ వైపు తిరిగాను. ఆశ్చర్యం. ఆవిడ ముఖంలో నామీద కోపం, అసహ్యం.

'ఏరా అధిక ప్రసంగీ. ఎవ్వెవడు అలా పిచ్చి పిచ్చి జవాబు లివ్వమన్నారు?'' అంటూ వెదాముదా తిట్టేసింది. నేనేం చేసినని నాకీ తిట్లు. నాకు తోచిన విషయాలు బయటకి చెప్పకూడదా? ఒకటే కన్‌ఫ్యూషన్. ఓ వారం రోజుల తరువాత, మనోరమ టీచర్ను రొటీన్‌గా టీచ్ చేసినందుకు ఇన్‌స్పెక్టరు గారు మందలించారని, పిల్లలలో క్రియేటివిటీ, ఇమాజినేషన్ పెంపొందే విధంగా పాఠాలు చెప్ప ప్రయత్నించమని సలహా ఇచ్చినట్లు మా సోషల్ టీచర్, లెక్కల మాస్టర్‌తో చెప్తుండగా విన్నాను. నన్ను తిట్టిన టీచర్ను మందలించారంటే, చెప్పొద్దూ, తెగ సంతోషమేసింది. కాని ఆవిడ తిట్టిన దెబ్బ, ఇప్పటికీ ఏదైనా మాట్లాడాలంటే కొంచెం జంకుతాను.

* * *

తెల్లటి పంచ, జుబ్బా. ఎప్పుడూ నవ్వుతున్న ముఖం. అప్పటికే 50 ఏళ్ల పైన వయస్సు. ఆయన వెంకట్రావ్ సార్. పాఠం చెప్పడం ప్రత్యేకత. మనస్సుకు హత్తుకొని పోయే విధంగా చెప్పడంలో ఆయనకి ఆయనే సాటి. అలానే నాటకాల పిచ్చి ఉన్న అహ్మదు సార్. ఆయన క్లాసు రూంనే ఓ రంగ స్థలంగా మార్చి మమ్మల్ని అందులో నటింపజేసే వారు. మార్టిన్ లూథర్, జూలియస్ సీజర్, గాంధి తాత చరిత్రలోని వారందరినీ మేము క్లాసులోనే సృష్టించుకోగలిగాం. ఇంకెవ్వరబ్బా నా టీచర్లు?

* * *

ముఖాలు లీలగా గుర్తొస్తున్నాయి. కాని విశేషాలేమీ గుర్తుండటం లేదు. వారు కూడా నా మనో వికాసానికి తోడ్పడ్డారు. కాదనను. కాని వారు నేనింత వరకు చెప్పిన టీచర్ల లాగ, నా మనస్సుకు హత్తుకుండే పనులేవీ చేయలేదు. అంటే సగటు టీచర్లు నా జ్ఞాపకాలకు నోచుకోలేదన్న మాటే. నా మనస్సుని గాయపరచిన టీచర్లు, నన్ను సంతోష పెట్టి, చదువంటే ఎంతో ఆసక్తి కలిగించిన టీచర్లతో బాటు నా మనస్సులో స్థానం ఏర్పరచుకోవడం ఆశ్చర్యకరమే. అంటే మెమొరీస్ కెన్ బి ఐదర్ సాడ్ ఆర్ హేపీ. జ్ఞాపకాలు దుఃఖాలు సుఖాలే! మధ్యలో వున్న సంఘటనలకు జ్ఞాపకాలలో తావు లేదు.

* * *

ఇంతకూ, ఇంతమంది టీచర్లలో ఎవ్వరు నా కిష్టం. నా నిర్ణయం ఎలాగూ నా టీచర్లకి తెలిసే ప్రసక్తి లేదు. కాబట్టే నిర్భయంగానే చెప్పొచ్చుననుకుంటాను. ఇంత వరకూ ఓపిగ్గా చదివిన మీరూ చెప్పొచ్చుననుకుంటాను. కానీ అదే తమాషా...

* * *

... ప్రొద్దున్న ఆరున్నర అవుతున్నది. ఇంకా చలిగానే ఉంది. చంకలో ఓ పిల్లాన్ని వేసుకొని, తన తల పిల్లవాడి తల తన కొంగుతో కప్పుకొని, బాయిలర్‌లో నిప్పులేసి రాజేయడానికి అవస్థపడుతున్న దావిడ. ఎనిమిదన్నర కంతా ముగ్గురు పిల్లల్ని స్నానాలు చేయించి టిఫిన్లు కట్టించి స్కూలుకు పంపాలి. భర్తను తొమ్మిది కంతా ఆఫీసుకు పంపించాలి. ఊపిరాడనంత పని. ఓ ప్రక్క బాయిలర్ అంటిస్తూనే మరో చేత్తో పుస్తకం పట్టుకొని, ''ఊఁ, అప్పజెప్పు బాబు', అంటూ ఓ మాట కూడా పొల్లు పోకుండా, ఎదురుగా నిలబడ్డ నాచేత అప్ప చెప్పించుకునే మనిషి నా కళ్ళ ముందు మెదుల్తుంది.

అన్ని పనుల్లోనూ లైబ్రరీ నుంచి శరత్ చంద్ర పుస్తకాలను తెచ్చుకొని ఆవిడ చదువుకోవడం గుర్తుంది. ఆవిడ ఒడిలో కూర్చునే కదా, నేను సాహిత్య ఉద్యానవనంలోకి అడుగు పెట్టాను.

అవునండీ, ఆవిడ నాకభిమానమైన చిరస్మరణీయమైన టీచర్. ఎంతైనా ఆవిడ మా అమ్మే కదా! ●